క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్ మార్పు



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలోని ఆది ఆంధ్ర పాఠశాలలోని 37వ పోలింగ్‌స్టేషన్‌ను స్థానిక డీపీఈపీ పాఠశాలలోకి మార్పు చేసినట్లు తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. గురువారం మార్పు చేసిన పోలింగ్‌బూత్‌ను పరిశీలించారు. గతంలో 35, 36, 37 పోలింగ్ బూత్‌లు ఒకే చోట ఉండడం వల్ల ఓటర్లు ఇబ్బందులు పడేవారన్నారు. ఓటర్ల అభ్యర్థనల మేరకు మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వీఆర్వో పక్కీరప్ప తదితరులు వున్నారు.

కవిత్వంతో మనోవికాసం



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరుటౌన్: కవిత్వం రాయడం, చదవడం వల్ల మనో వికాసంతో పాటు నైతిక విలువలు అలవడుతాయని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ కవిత్వ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు వారి కవిత్వాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎంఈ తిరుమల, ఎస్.న్యూటన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జింక పిల్ల అప్పగింత



ఏఎస్ఐకు జింకపిల్లను అప్పగిస్తున్న రైతులు

మద్దికెర : మండల కేంద్రం మద్దికెర గ్రామ పరిసరాలలో పొలాలలో మంద నుంచి తప్పిపోయిన జింక పిల్లను రైతులు కిట్టి, గోపాల్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ చెన్నయ్యకు అందజేశారు. పొలాలలో ఒకచోట పడి వున్న జింకపిల్లను గుర్తించామని, తల్లి నుంచి వేరై పోయిందన్నారు. ఎలాగైనా చేర్చాలని చుట్టుపక్కల చూసినా తల్లి జాడ కనిపించకపోవడంతో పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు



ఎల్లార్తి దర్గాలను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిజిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా మూగితాత ఉరుసు

దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండలోని దిగంబర దివానె మూగితాత 39వ ఉరుసు వేడుకలు గురువారం దర్గా కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దలు ధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచే గాక చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి తాత వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం ఉరుసు, శనివారం జియారత్ కార్యక్రమాలు జరుగనున్నాయి.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఓటు హక్కు వున్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 'నీ ఓటు నీ భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి వేసే ఓటే భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మదన్, మెప్మా సీఎంఎం జయవర్దన్, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక
- పట్టణంలోని 18వ వార్డు, వెంకటాపురం కాలనీలో విస్తృత ప్రచారం



18వ వార్డులో మహిళలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక



వెంకటాపురం కాలనీలో పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటు పడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కోరారు. గురువారం ఉదయం పట్టణంలోని 18వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ రంగమ్మ, వార్డు ఇన్‌చార్జ్‌లు సోమేష్, శివగంగ, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిపొందిన తీరును మహిళలకు, వృద్ధులు, యువకులను అడిగి తెలుసుకుంటూ.. వార్డులో ఆమె దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

టీడీపీ మోసపూరిత మాటలు నమ్మొద్దు

టీడీపీ వారు అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలిస్తామంటూ మభ్యపెట్టి మోసగించేందుకు వస్తున్నారని వారిని నమ్మవద్దని బుట్టా రేణుక హెచ్చరించారు. టీడీపీ చెప్పే సూపర్ సిక్స్ పథకాలకంటే సీఎం జగనన్న ఎక్కువగా నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ ఫలాలు ఐదేళ్లలో పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు అందిచారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో నాడు ప్రజలు ఆయనను ఇంటికి పంపారని గుర్తుచేశారు. ఎన్నికలొచ్చాయని మళ్లీ కల్లబొల్లి మాటల హామీలు కురిపించేందుకు వచ్చే వారికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కార్యదర్శి వీరేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు వాహిద్, ఇషాక్, రాజారత్నం, అమాన్, సుధాకర్, వార్డు ఇన్‌చార్జ్‌లు కోటకొండ నరసింహులు, కె.విశ్వనాథ్, చంద్రశేఖర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అబ్రార్, గట్టుభాజ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికే సీఎం జగనన్న ప్రాధాన్యతనిచ్చింది

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి ప్రాధాన్యతనిచ్చి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో నేడు మహిళలు, వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక అన్నారు. గురువారం రాత్రి వెంకటాపురం కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమానికి కాలనీ వాసుల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆ కాలనీలో 28వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బోయబజారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లు, మంచినీటి సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, నాయకులు భాస్కర్‌రెడ్డి, బోయ రాజు, కౌన్సిలర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇచ్చే జగన్ పార్టీ గుర్తు ఫ్యాన్‌కే ఓటేస్తా



బుట్టారేణుక చేయి పట్టుకొని ఫ్యాన్‌కే ఓటేస్తానంటున్న వృద్ధురాలు పద్మావతి

ఎమ్మిగనూరుటౌన్: నాకు రెండు కళ్లు కనిపించవు. నెలకు రూ3.వేల పింఛన్ ఇచ్చే వైఎస్ జగన్ పార్టీ గుర్తు ఫ్యాన్‌కే ఓటు వేస్తానంటోంది పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ఓ అంధ వృద్ధురాలు పద్మావతి. గురువారం ఇంటింటి ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక వార్డులోని ఆలయవీధిలో వున్న ఇంటికి వెళ్లగా ఇంట్లో నుంచి తలుపు పట్టుకొని బయటికి వచ్చిన వృద్ధురాలు ఎవరంటూ ప్రశ్నించింది. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి అవ్వా నేను బుట్టా రేణుక అనేలోగా.. ఇలారా అంటూ ఆమె చేయి పట్టుకొని నువ్వేనా బుట్టారేణుక అంటే నాకు కళ్లు కనిపించవమ్మా. నాకు నెలకు రూ.3వేలు పింఛన్ ఇస్తున్నారు. నేను ఫ్యాన్‌కే ఓటు వేస్తానులే అంటూ బుట్టారేణుకను దీవించి మరీ పంపి తన అభిమానాన్ని చాటుకుంది.

కనుల పండువగా చెన్నకేశవ స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న బీవై రామయ్య, విరూపాక్షి

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో వెలిసిన శ్రీ చెన్నకేశవమాధవస్వామి రథోత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. పూజారులు పూర్ణకుంభం ధరించి చరిత్రను గురించి చెబుతూ, రాబోయే కాలంలో పండించే పంటల గురించి వివరించారు. వేలాది మంది భక్తుల మధ్య వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య రథాన్ని లాగి ప్రారంభించారు. భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రథాన్ని ఆలయం నుంచి ఊరి చివరి దాకా లాగారు.

ఎలాంటి విభేదాలు లేవు

వైఎస్సార్‌సీపీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని ఆ పార్టీ కర్నూలు పార్లమెంటు అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి స్పష్టం చేశారు. గురవారం మండలంలోని తెర్నేకల్లు గ్రామంలో జరిగిన శ్రీ లక్ష్మి చెన్నకేశవ మాధవ స్వామి రథోత్సవంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో విభేదాలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తునాయన్నారు. ఓటమి భయంతోనే ఇలాంటి అసత్య ప్రచారాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాదికారి కొత్త కాపు మధుసూదన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, నిజాల్ రెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, అరుణ్ కుమార్, ఋమాంబ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం... రథోత్సవం



పెద్దహోతూరులో భక్తుల నడుమ రథోత్సవం



ప్రత్యేక పూజలందుకుంటున్న హుచ్చువీరప్ప తాత

ఆలూరు రూరల్: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువైన హుచ్చు వీరప్ప, మరకట్టు గ్రామంలోని సలువప్ప తాతల రథోత్సవం గురువారం రమణీయంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల ప్రజలతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తుల పెద్ద ఎత్తున తరలివచ్చారు. రథంపై ఉన్న కలశానికి ఫలాలను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా పెద్దహోతూరు గ్రామం జనసంద్రంగా మారింది. మరకట్టు గ్రామంలో కొలువైన సలువప్పతాత ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు ఉదయం వేద మంత్రోచ్చరణలతో పెద్దహోతూరు గ్రామానికి చేర్చారు. సాయంత్రం హుచ్చు వీరప్ప, సలువప్ప ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి రథంపై చేర్చారు. సాయంత్రం వేలాది భక్తులు మధ్య ఎదరు బసవన్న విగ్రహం వరకు రథాన్ని లాగారు. అంతకుముందు ఆలయ అర్చకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో స్వామికి కుంకుమార్చన, జలాభిషేకం, మహామంగళ హారతి, గంగి పూజ వంటి తదతర పూజలు నిర్వహించారు. పెద్దహోతూరు గ్రామంలో ప్రతి ఏటా కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఆలయాన్ని సందర్శించిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచి పెట్టారు. ఉత్సవం సందర్భంగా గ్రామానికి వచ్చే భక్తుల కోసం ఉచితంగా ఆటోలతో రవాణా సౌకర్యం కల్పించారు. రథోత్సవానికి తిలకించేందుకు వెళ్లే భక్తుల కోసం ఆలూరు పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఉచితంగా మజ్జిగ, మంచి నీళ్లను పంపిణీ చేశారు. ఆలూరు సీఐ వెంకటే శ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ ఓబులేసు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీరంగనాథస్వామి మూలవిరాట్



ఆకుపందిరి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు భక్తుల మధ్య గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆకు పందిళ్ల బండ్లను ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విష్వక్సేన పూజలు చేసిన అనంతరం కలశస్థాపన, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజ సంభానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ధ్వజా రోహణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సతీసమేతుడైన గనాథుడు పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉత్సవాలలో ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మలికార్జున తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఆలూరు రూరల్: ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు బార్ అండ్ అసోసియేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు న్యాయవాదుల ఎన్నికల అధికారి సిద్దప్ప గురువారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకు నామినేషన్ల స్వీకరణ, 26వ తేదీన మధ్యాహ్నం 12.30 లోపు స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 10 నుంచి 2 గంటల వరకు పోలింగ్, అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్, లైబ్రేరియన్ పోస్టులకు అభ్యర్థులు పోటీ చేయవచ్చన్నారు.

నేడు మండలంలో విరూపాక్షి పర్యటన

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి మండల పరిధిలోని దౌల్తాపురం, నంచర్ల గ్రామాలలో శుక్రవారం పర్యటిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆయా గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ పెద్దఎత్తున పాల్గొని విరూపాక్షి పర్యటనను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం

చిప్పగిరి: 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ పద్మజ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడతూ ఇప్పటి వరకు మండలంలో మొత్తం 24,400 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 12,187 మంది, స్త్రీలు 12,208 మంది, ఇతరలు ఐదు గురు ఉన్నారని వివరించారు. 18 సంవత్సరాలు పైబడిన వారు ఉంటే వచ్చే నెల 15 లోపు పారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

28న పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ట

తుగ్గలి : లంకాయపల్లిలో ఈనెల 28న పెద్దమ్మ అవ్వ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గురువారం గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, భక్తుల విరాళాలతో దాదాపు రూ.18లక్షలతో పెద్దమ్మ ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశామన్నారు. 26న గణపతి పూజ, కలశస్థాపన, అభిషేకాలు, 27న నాగదేవతలు, నాభిశిల ప్రతిష్ఠ, హోమాలు, గ్రామోత్సవం, 28న ఉదయం 8 గంటలకు పెద్దమ్మ దేవత, పోతు రాజు, కలశ ప్రతిష్ఠలు ఉంటాయన్నారు. ప్రతిష్ఠ పురస్కరించుకుని 26న రాతి దూలం లాగుడు పోటీలు, 27న చెక్క భజన ఏర్పాటు చేసినట్లు వివరించారు. వృషభ విజేతల యజమానులకు దాతలు అమరనాథరెడ్డి, సయ్యద్‌సుల్తాన్, రమేష్, రామాంజినేయులు, లింగన్న, ఆదినారాయణ, చంద్రశేఖర్, శీను, భాస్కర్, రాము, అరవ శీను, ముని స్వామి వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7,500, రూ.5వేలు చొప్పున అందజేస్తారని వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

తుగ్గలి : మండల పరిధిలోని ఎద్దులదొడ్డికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెడసాని రాజు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కర్నూలులో చికిత్స తీసుకుని ఇటీవల ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం సాయంత్రం రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీలో క్యాంపస్ నియామకాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో క్యాంపస్ నియామకాలు జరిగినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరన్న గురువారం తెలిపారు. బెంగళూరుకు చెందిన టీఏపీ అకాడమీ వారు బీటెక్ చివరి సంవత్సరం చదవుతున్న ఈసీఈ, సీఎస్ఈ, ఎంఈసీ బ్రాంచ్‌లకు చెందిన 10 మంది విద్యార్థులను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శిగా స్వర్ణలత

మద్దికెర: మద్దికెర మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న స్వర్ణలతకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సర్పంచ్ సుహాసిని గురువారం తెలిపారు. గతంలో ఈఓగా పనిచేస్తున్న శ్రీహరి ఈఓఆర్డీగా పదోన్నతి రావడంతో కోవెలకుంట్లకు బదిలీపై వెళ్లారు. దీంతో ఎం.అగ్రహారం ఈఓ సంజప్పను ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే ఆయన గ్రేడ్-1 కార్యదర్శిగా పదోన్నతిపై అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లడంతో స్వర్ణలతకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

నేలకొరిగిన భారీ వృక్షం

దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండ-కర్నూలు బైపాస్ రోడ్డులో గద్దెరాళ్ల స్టేజీ సమీపాన కర్నూలు వైపు భారీ వృక్షం రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన సీఐ శ్రీనివాసులు వెంటనే జేసీబీని పిలిపించి భారీ వృక్షాన్ని పక్కకు తొలగించారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. వాహనచోదకులు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో 45 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన నెట్రవటి గ్రామస్తులతో బుసినే విరూపాక్షి

చిప్పగిరి: హాలహర్వి మండలంలోని నెట్రవటి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 45 కుటుంబాలు గురువారం ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్‌సీపీ చేరారు. బుసినే విరూపాక్షి స్థానిక స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వారికి విరుపాక్షి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విరూపాక్షి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చూసి టీడీపీ వర్గీయులు చాలామంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా విరూపాక్షి కోరారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, మల్లయ్య,గంగాదర్, గిరి, చిన్న మారెన్న, నాగలింగ, లక్ష్మన్న, నాగరాజు, రామచంద్ర, నాగప్ప, బండెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ రాము నాయక్

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా అమలు చేయాలని ఆలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రాము నాయక్ ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం, ఐటీ టీంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీ-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదును ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలకు సమాచారం అందిచిన వంద నిమిషాలలో క్లోజ్ చేయాలన్నారు. ప్రతి మండలానికి ఒక సీ-విజిల్ యాప్ టీం, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టీంకు ఒక వాహనం ఏరపాటు చేశామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు సెక్టోరల్ అధికారుల పర్యవేక్షణలో అభ్యర్థుల ప్రచారంపై ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా హెల్ప్ డెస్కుకు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆలూరు పోలీసు సర్కిల్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయా గ్రామాల పరిధిలో వచ్చే ఫిర్యాదులను ఈఆర్వోతో పాటు మండల ఎస్ఐలకు సమాచారం అందించాలన్నారు. ప్రార్థన మందిరాల వద్ద రాజకీయ పార్టీల సమావేశాలు,సభలు నిర్వహిస్తే కేసులు నమోదు చేయాలి సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించిన అధికారులు,సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఈఆర్వో రాము నాయక్ హెచ్చరించారు. సమావేశంలో ఏఆర్వో చంద్రశేఖర్, డీటీ రజనీకాంత్ రెడ్డి, ఈడీటీ గుండాల్ నాయక్, టీంల నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



తుగ్గలిలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

తుగ్గలి : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి కోరారు. గురువారం జొన్నగిరి, తుగ్గలి, రాతన గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి సీఐ కవాతు నిర్వహించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక శక్తులకు సహకరించినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు మల్లికార్జున, రామాంజినేయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరిద్దాం



చెక్కు అందజేస్తున్న దాత మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి

మద్దికెర : ప్రతి ఒక్కరూ తమ వంతు సహకరించినపుడే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన మద్దికెరలోని ప్రధాన బజారులో గ్రామీణ మార్కెట్ నిర్మించేందకు నాబార్డు రూ.15 లక్షలు మంజూరు చేసింది. కాంట్రిబ్యూషన్ కింద గ్రామ మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి అందించిన రూ.3.50 లక్షలు చెక్కును నవయూత్ అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, లక్ష్మీనారాయణకు అందజేశారు. గ్రామంలో అభివృద్ధి పనులను తమ కుటుంబం ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని మాజీ సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వరరెడ్డి, విజయప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు.

చదువుకున్న పాఠశాలకు తన వంతుగా..



రేకుల షెడ్డును ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థి

ఆస్పరి: ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుచున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా పూర్వ విద్యార్థి వీరేంద్రబాబు రూ.3 లక్షల ఖర్చుతో రేకుల షెడ్డు నిర్మించారు. వీరేంద్రబాబు స్వగ్రామం ఆలూరు మండలం మొలగవల్లి. 1985 నుంచి 1988 వరకు ఆయన తండ్రి కై రుప్పలప్ప ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. దీంతో వీరేంద్రబాబు కూడా 6 నుంచి 8వ తరగతి వరకు ఇక్కడే చదువుకున్నాడు. ప్రస్తుతం వీరేంద్రబాబు బెంగళూరులో కెనరా బ్యాంకు డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన కెనరా బ్యాంకు సహకారంతో రూ.3 లక్షలతో విద్యార్థుల కోసం రేకుల షెడ్డు నిర్మించారు. గురువారం రేకుల షెడ్డును వీరేంద్రబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులు నీడలో భోజనం చేయాలనే ఉద్దేశంతో రేకుల షెడ్డును నిర్మించానన్నారు. పూర్వ విద్యార్థిని హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్లు వేణుమాదవ్, సూర్య చంద్ర, షేక్షా బాషా పాల్గొన్నారు.